ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక (6.12.61)

# సుశీల అక్కయ్య

పిల్లలకు సమస్తమూ పెద్దలే. పిల్లల బాగు కోరతారు. స్వతహాగా మంచి వారు అయితే మరీను. ఏ కారణం చేత అయినా వారికి ఒక అక్కసు ఏర్పడితే తెలియకనే, కోరకనే దానిని పిల్లలకు అప్పగించుతారు, వారసత్వంగా.

"మే ఐ కమిన్ సార్!....."

క్లాసు రూము ద్వారంలో నిలబడిన కోమల గాత్రి కోమలి మీద నలభై నాలుగు జతల కళ్ళు తూపులు విసిరాయి.

బర్క్ ఉపన్యాసంలో మునిగిపోయిన లెక్చరరు శ్రీహరిరావు ఆమెను చూసి ఉలిక్కిపడినట్లయి రెండు క్షణాలకు నిలద్రొక్కుకున్నాడు. పావు నిముషం వరకు అనిమిష నేత్రాలతో కోమలినే అతడు పరికించటం క్లాసులో అందరికీ ఆశ్చర్యం కలిగించింది.

ఇంగ్లీషు లెక్చరరు శ్రీహరిరావు కాలేజీలో డ్యూటీలో చేరి మూడు రోజులయింది. ఈ మూడు రోజుల్లోను అతడు చెప్పే పాఠాలు, అర్థ వివరణ విద్యార్థుల్ని బాగా ఆకర్షించాయి. సాధారణంగా క్రొత్త లెక్చరరు వస్తే అటాడించే కుర్రకారు పట్టుమని పాతిక సంవత్సరాలయినా లేని శ్రీహరిరావు లెక్చర్ విన్న పది నిముషాలకే బుద్ధిమంతులైపోయి అతనిపై అందరికీ గురుభక్తి పుట్టుకొచ్చింది... ఈ మూడు రోజులూ కోమలి కాలేజీకి రాకపోవడం మూలాన శ్రీహరి ఆమెను, ఆమె అతన్ని చూడలేదు.

సహజ గాంభీర్యంతో మితభాషిగా, క్లాసులో ఉన్న మరి ఇద్దరు విద్యార్థినులను పొరపాటునైనా చూడని శ్రీహరి కోమలిని చూసి స్థాణువులా నిల్చిపోవటం అందరినీ అప్రతిభుల్ని చేసింది.

"....కమిన్!" అన్నాడు శ్రీహరి. క్రొత్త లెక్చరరుగారిట్లా చలించిపోయాడేమిటా అని అప్పటికే ఆలోచనలో పడిపోయింది కోమలి. హంస గమనంతో వయ్యారంగా తన సీటు దగ్గరికి వెళ్ళి కూర్చుంది. ఆమె దృష్టి శ్రీహరిమీద నుంచి మరలలేదు. సహాధ్యాయిని రజనివైపు అప్పుడప్పుడూ నవ్వుతూ చూసేది.

అంతకుముందున్న ఆవేశం తగ్గిపోయింది శ్రీహరి కంఠంలో. తిరిగి అతడు కోమలివైపు చూడలేదు కాని.... ఆమె రాకతోనే మాస్టారు చలించిపోయారని విద్యార్థులంతా గ్రహించేశారు. ఇంకో క్షణంలో అయితే పిల్లికూతలు, నక్క కూతలతో గోలచేసేవారేమో కాని, అతనిపై నున్న గౌరవం కొద్దీ మాట్లాడక ఊరుకున్నారు.

ఎట్లాగో పీరియడ్ గడపటమే అన్న తలంపు కనపడింది... శ్రీహరి తదుపరి లెక్చర్‌లో. గంట వినిపించగానే వాక్యం కూడా పూర్తి చేయకుండా క్లాసు విడిచి వెళ్ళిపోయాడు.

రజని, కోమలి లేడీస్ రూము వైపు బయలుదేరారు. ఇద్దరూ ఆలోచనలో పడి ఒకరి నొకరు పలకరించుకోలేదు.

ఇద్దరూ ఒంటరిగా చేరాక, "ఈ మాస్టారెప్పుడు వచ్చారే?" అని అడిగింది కోమలి.

"మూడు రోజులైంది... అది సరే, తొలి చూపులోనే మాస్టారి మతి పోగొట్టేశావు. ఇప్పటికే కొందరు లెక్చరర్లు సిడ్నీ కార్టను ముఖాలేసుక్కూర్చున్నారు. ఈయనన్నంత పని చేశావా మనకింక సరైన లెక్చరర్ దొరకడు. మా గురించైనా కాస్త ఆ అందం దాచుకోవే తల్లీ!" అంది రజని కిలకిలా నవ్వుతూ.

"ఘోషా స్త్రీలా బుఱకా వేసుకు రమ్మంటావా? నన్నట్లా మింగేసేలా చూడమని నేను చెప్పానా?" అంది కోమలి గోముగా. ఆమె మాటల్లో కొంచెం గర్వం కూడా ధ్వనించింది.

"సరి సరి! ఇదేదో కథకు నాంది పలికినట్లుగా ఉంది. ఎంతవరకు వస్తుందో చూద్దాం! గంట కొట్టారు. పద!" అని రజని అనడంతో తిరిగి క్లాసువైపు బయల్దేరింది కోమలి.

• • •

మరునాడు ఇంగ్లీషు క్లాసుకు శ్రీహరి రావుకు బదులు లెక్చరర్ మాధవరావు వచ్చాడు.

అతడర్థం పర్థం లేని లెక్చరిచ్చి గంట రోజనిపించేలా చేసి వెళ్ళిపోవటం ఇదివరకా క్లాసు విద్యార్థులందరికీ అనుభవమే! తిరిగి ఈయన వచ్చేసరికి వాళ్ళంతా ఒకరి ముఖాలింకొకరు చూసుకొని కంగారుపడిపోయారు. విద్యార్థినుల స్థితి కూడా అట్లాగే ఉంది.

అప్పటికే మాధవరావు అటెండెన్స్ వేసి పాఠం ప్రారంభించేశాడు. వెనుకటిలా నిద్రపోవటానికి కొందరు, కబుర్లు చెప్పుకోటానికి మరికొందరు, ఈలలు వేయటానికి మరి కొందరు సన్నద్ధులయ్యారు. అందరిలోనూ అసహనం వ్యక్తమౌతూంది.

క్లాసు లీడరు తెగించి, "మాస్టారూ! ఈ వేళ శ్రీహరిరావుగారు రాలేదాండీ?" అని అడిగాడు.

"ఆయన మీ క్లాసు తీసుకోనన్నారుట! ప్రిన్సిపాల్ నన్ను తీసుకోమన్నారు" అని ముక్తసరిగా చెప్పి తిరిగి లెక్చర్ కొనసాగించాడు మాధవరావు. అంతా ఉస్సురన్నారు. ఆ గంట ఒక యుగమో, కల్పమో అన్నట్లు గడిపారు.

ఆ క్లాసు అయిపోయిన వెంటనే నలుగుర్ని వెంట పెట్టుకుని క్లాసు లీడరు స్టాఫ్ రూమ్ లోకి వెళ్ళాడు. అక్కడ శ్రీహరి, మాధవరావు ఏదో మాట్లాడుకుంటున్నారు.

విద్యార్థి బృందాన్ని చూసి శ్రీహరి కొంత విషయమర్థం చేసుకున్నట్లే కనిపించాడు. ఏమన్నట్లు చూశాడు.

"మీతో ఒకసారి మాట్లాడాలి. కొంచెం బయటకు వస్తారా మాస్టారూ?" అన్నాడు క్లాసు లీడరు.

రానని చెప్పేటట్లుందతని ముఖం. కాని అది అతని స్వభావానికే విరుద్ధం. మాధవరావు వైపోసారి చూసి నెమ్మదిగా విద్యార్థులననుసరించి బయటకు వచ్చాడు.

"మీరు మా క్లాస్ తీసుకోనన్నారుట! ఎందుచేత సార్?" అని అడిగాడు క్లాసు లీడరు.

"నాకు వీలు లేదోయ్!"

"మేమేదైనా అల్లరి చేశామని మీరట్లా చేశారా? మూడు రోజుల్నించి మీరు చూస్తూనే ఉన్నారుగా! మా అదృష్టం కొద్దీ మీరు వచ్చారనుకున్నాం. మీరు తప్పక మా క్లాసు తీసుకోవాలి మాస్టారూ! మాలో ఎవడైనా మీ విషయంలో అసభ్యంగా ప్రవర్తిస్తే అతని తరఫున క్షమార్పణ నేను కోరుకుంటాను..."

నిజంగానే అప్రతిభుడైపోయాడు శ్రీహరిరావు. ఆ క్లాసు విద్యార్థులంతా తనపై జూపే వాత్సల్యం అతన్ని చలింపచేసింది. కాని, అంతరాంతరాలలో అతనిలోని ధృఢ సంకల్పమేదో అతన్ని వారించింది. "అది కాదు మిస్టర్ రంగనాథం! మీరెటువంటివాళ్ళో నాకు తెలుసు. కాని, ఫస్టు బి.ఎ. వాళ్ళు అల్లరి చేసి తన మాట వినటంలేదని మాధవరావుగారు ప్రిన్సిపాల్‌తో చెప్తే ఆయనే ఇట్లా చేయమన్నారు. ఇందులో నా ప్రమేయం లేదు."

శ్రీహరి మాటలకు రంగనాథం ప్రభృతులు సందిగ్ధంలో పడిపోయారు. వాళ్ళకు మరో మాట చెప్పటానికి తోచలేదు. శ్రీహరినెట్లా ఒప్పించాలోనని వాళ్ళాలోచిస్తుండగానే అతను

స్టాఫ్ రూమ్‌లోకి వెళ్ళిపోయాడు. ప్రిన్సిపాల్ గారే అట్లా నిర్ణయించారనేసరికి విద్యార్థులకేం చేయాలో తోచలేదు.

లేడీస్ రూమ్ ముందుగా పోతున్న రంగనాథం తదితరుల్ని ఆ గుమ్మంలో నుంచున్న రజనీ కోమలులు చూసి పలుకరించారు.

"మిస్టర్ రంగనాథం! మాస్టారు మన క్లాసెందుకు తీసుకోనన్నారు?" అని అడిగింది రజని.

జరిగింది చెప్పి, "... మామాట ప్రిన్సిపాల్‌గారు వింటారని నమ్మకం లేదు. మిస్ కోమలి, మీరు కలిసి ప్రయత్నించండి. లేకపోతే, ఇక మాధవయ్యగారి క్లాసులో నిద్రపోవాలి మనం" అన్నాడు రంగనాథం. అంతా పక పక నవ్వుకున్నారు.

"నడవ్వే! మన ప్రయత్నం కూడ చేద్దాం! ...." అంది కోమలి.

"నీ కవసరమైతే నువ్వెళ్ళు. నాకెందుకు గొడవ? మధ్య నేనేదో గ్రంథం నడిపానను కోవటానికా?" అంది రజని ముసి ముసి నగవులతో కోమలి బుగ్గలో పొడిచి.

"నీ కంత వేళాకోళంగా ఉందన్నమాట!..." అంది నిరుత్సాహంగా కోమలి.

"సరే పద! ఇక నుంచి నీ నిష్ఠూరాలు నేను భరించలేక ఆ శ్రీహరిరావుగారినే బ్రతిమాలాల్సి వస్తుందేమో ఖర్మ!" అంది రజని.

ఇద్దరూ ప్రిన్సిపాల్ రూములోకి వెళ్ళారు. అక్కడ ప్రిన్సిపాల్‌గారితో మాట్లాడుతున్న శ్రీహరిని చూసి ఇద్దరూ ఒకరి ముఖం ఇంకొకరు చూసుకున్నారు సాశ్చర్యంగా. రెండు నిముషాల దాకా వాళ్ళ నోటి వెంట మాట రాలేదు.

వాళ్ళను చూడగానే శ్రీహరి ప్రిన్సిపాల్‌తో వెడతానని చెప్పి నిష్క్రమించాడు.

"ఏమిటి సంగతి..." అని ప్రిన్సిపాల్ అడిగారు.

రజని చెప్పింది. "... ఎందుకనో శ్రీహరి రావుగారు మా క్లాసు తీసుకోనన్నారుటండి. ఫస్టు బి.ఎ. వాళ్ళకంటె ముందుగా పరీక్షకు వెళ్ళే వాళ్ళం మేము. మాకు వారి సహకారం లేకపోతే ప్యాసవటం కష్టం. మా క్లాసంతా ఇదేమాటమీదున్నారు. మీరు దయయుంచి వారితో మా క్లాసు తీసుకోమని చెప్పండి."

"నాకూ తెలియదు. ఆయనే అడిగి ఫస్టు బి.ఎ. క్లాసు తీసుకున్నారు. సరే, నేను చెప్పి పంపిస్తానులెండి. మీరు వెళ్ళవచ్చు."

ముఖాలు చంద్రబింబాలుగా చేసుకొని ప్రిన్సిపాలుగారికి నమస్కరించి స్నేహితురాళ్ళిద్దరూ బయటకు నడిచారు.

...... తత్ఫలితంగా ఆ మరునాడు శ్రీహరి ఆ క్లాసు తీసుకోక తప్పలేదు. ప్రిన్సిపాలు స్వయంగా ఆ విద్యార్థుల బాగు కోరి సూచించుటంతో అతను మాట తీసివేయలేకపోయాడు.

క్లాసంతా నూతనోత్సాహంతో ఉబ్బి తబ్బిబ్బయింది. అందరి ముఖాలలోను ఆనందోత్సాహాలు ద్యోతకమై శ్రీహరిమీద గురుభావం మరింత వృద్ధి అయినట్లు కనిపించింది.

కోమలి రజని వైపు చూసి విజయహాసం చేసింది. విద్యార్థినుల వైపే తల త్రిప్పకుండ యథాతథంగా లెక్చర్ కొనసాగించాడు శ్రీహరి.... ఇట్లాగే రోజులు గడుస్తున్నాయి.

శ్రీహరిరావు ప్రవర్తన విద్యార్థులలోనే కాకుండా లెక్చరర్లందరికీ కూడా ఆశ్చర్యం కలిగించింది. అతను బెనారస్ హిందూ యూనివర్సిటీనుంచి క్రొత్తగా ఎం.ఎ. ప్యాసయి వచ్చి ఈ కాలేజీలో చేరాడు. అతని పూర్వ చరిత్ర ఎవరికీ తెలియదు. అతనొక్కడే మ్యునిసిపల్ కాలనీలో ఒక గదిలో ఉంటున్నాడని మాత్రం అందరికీ తెలుసు.

అతను ఎప్పుడూ గంభీర ముద్ర వహించి ఉంటాడు. మితభాషి. ఆడపురుగు కనిపిస్తే పొరపాటునైనా తల త్రిప్పి చూడడు. అతనంత ముభావంగా ఉండటానికి కారణం ఎవరికీ తెలియదు. అతనిని కవ్వించాలని చాలామంది విద్యార్థినులు కూడా ప్రయత్నించి విఫలులయ్యారు. కోమలి, రజని ఒకటి రెండు సార్లు పాఠాలు గురించి సందేహాలు తీర్చుకోవటానికి స్టాఫ్ రూమ్‌కు వెళ్ళినప్పుడు కూడా వాళ్ళవైపు చూడకుండానే సమాధానం చెప్పి పంపేశాడు..... అతని తీరుచూచి పోకిరీ కుర్రకారు 'విశ్వామిత్ర మహర్షి' అని కూడా దూరంగా అతన్ని పిలవటం జరిగింది. ఇటువంటి చిన్న విషయాలతను పట్టించుకునేవాడు కాదు.

అతనెందుకట్లా ఉంటాడో తెలుసుకుందామని లెక్చరర్లెవరూ ప్రయత్నించలేదు. అసలు ఆ కాలేజీ వాతావరణమే అంత! ఓహో అంటే ఓహో అనుకోవటమే కాని తోటి వ్యక్తి నిర్లిప్తంగా కనిపిస్తున్నాడంటే అతనిలో ఏమైనా అగ్ని పర్వతాలు బ్రద్ధలై లావాద్రవాన్ని కురిపిస్తున్నాయేమో అన్న ఆలోచన ఉండదు.

కాని, అందరితో చాలా సరదాగా మాట్లాడే ఎకనమిక్సు లెక్చరరు రవికాంత్ వచ్చినప్పటి నుంచీ శ్రీహరిరావుతో బాగా చనువైపోయాడు. అతడు రజని అన్నగారు. చూచాయగా శ్రీహరిపై ఉండే కాలేజీ ప్రాణుల అభిప్రాయాలు అతనికి తెలిశాయి.

ఒక రోజున శ్రీహరిని గురించి వివరాలడిగాడు రవికాంత్. తన నప్పుడడుగవద్దని, సమయం వచ్చినప్పుడు చెపుతానని దాటవేశాడతను. ఆ విషయం రవి రజనితో మాటల సందర్భంలో అంటే ఆ వార్త కోమలి చెవిలో వేసింది... మొత్తానికి శ్రీహరిరావు జీవిత గాథ ఏదో విషాదపూరితమైనదే అయి ఉంటుందని స్నేహితురాండ్రు నిశ్చయించుకున్నారు.

• • •

'చేతి ఫలము కంటె చెట్టునున్నది మిన్న' అనుకోవటం, అందని పండునే ఆశించటం, ఎట్లాగా అందదని తెలిసి కూడ దానికోసమే అర్రులు చాచటం మానవుడు చేసే పనుల్లో మొట్టమొదటిదీ.... చిట్టి చివరదీను.

అట్లాగని తెలిసి కూడ నిగ్రహించుకోవటం కోమలికి కష్టమే అయింది. శ్రీహరి ఎంత దూరంగా ఉంటున్నాడో ఆమె అతని కంత దగ్గరగా రాసాగింది. స్త్రీ ద్వేషం అతన్నెందుకు చుట్టుకుందో తెలుసుకోవాలని ఆమె ఎంత ప్రయత్నించినా కొరుకుడు పడలేదు.... తన

సౌందర్యంతో ఆతన్నాకర్షించాలనుకోవటమంత అవివేకం మరొకటి లేదని ఆమెకు ముందే అనుభవమైంది. తెలిసి కూడ ఆ ప్రయత్నం చేస్తే తన వ్యక్తిగతమైన విలువలకే అది గొడ్డలిపెట్టు అవుతుందని ఆమె గ్రహించింది. తనను చూసి మొట్టమొదట్లో అతడు చలించిన క్షణాలు ఆమె మరిచిపోలేదు. అందుకని, తనవల్ల అతడు మారవచ్చుననే ఆశ ఆమె కోర్కెలకు కోటలు కట్టింది.

రవికాంత్ రజనికి అన్నగారు కదా, స్నేహపూర్వకంగా శ్రీహరి వాళ్ళింటికి వస్తే తను పరిచయం పటిష్ఠమవటానికి వీలుంటుందని ఆశించింది కోమలి. ఆ ఊరువచ్చి నాలుగు నెలలైనా శ్రీహరి ఒక్కమాటు కూడా రవికాంత్ ఇంటికి రాలేదు. అతడాహ్వానించక కాదు. శ్రీహరే ఎంత బలవంతపెట్టినా వెళ్ళలేదు... నలుగుర్లోకీ వస్తే అతనికి సన్నిహితమవటం సులువే అనుకున్న కోమలి కీ ఆశ కూడా భగ్నమైంది.

అతడు కన్నెత్తి తనవైపు చూడకపోయినా ఆ సుందర గంభీర ముఖమే ఆమె నాకర్షించు కుంటోంది. ఆమెకు తెలియకుండానే మనసులో అనురాగబీజాలు పుష్పించసాగాయి. అది కనిపెట్టినది రజని ఒక్కతే!

కోమలి అట్టేకాలం అట్లా గడపలేకపోయింది. శ్రీహరితో తన మనోభావాలు చెప్పు కోవాలని నిశ్చయించుకుంది. ప్రత్యక్షావకాశం లభించదని ఆమెకు తెలుసు. అందుకని ఒక ఉత్తరం వ్రాసి కవరులో అతని ఇంటి అడ్రసుకు పోస్టు చేసింది....

మరునాడు కాలేజీకి వెళ్ళడానికి భయపడింది కోమలి. ఏదో తెలియని ఆందోళన ఆమె నావరించుకుంది. రజని కాలేజీకి వెడుతుంది కదా, శ్రీహరి సమాధానం ఇస్తే ఆమెకు తెలియకపోదని దానికోసమే నిరీక్షించాలనుకుంది.

కోమలి ఊహ పూర్తిగా కాకపోయినా సగం నిజమైంది. ఆవేళ శ్రీహరిరావు కూడ కాలేజీకి రాలేదు. ఒక విద్యార్థి ద్వారా సెలవు దరఖాస్తు, మరో కవరు రవికాంత్‌కు పంపాడు. సెలవు దరఖాస్తు ప్రిన్సిపాలుగారికి పంపి ఆ కవరుపై తన పేరే ఉండడం చూసి ఆశ్చర్యంగా అందులోని కాగితాలు తీసి ఏకాంతంగా కూర్చుని చదవసాగాడు రవికాంత్.

చిన్న కాగితం మీద కోమలి శ్రీహరికి వ్రాసిన ఉత్తరం ఉంది. ముందది చదవసాగాడు రవికాంత్.

"శ్రీ శ్రీహరిరావుగార్కి,

నమస్తే! బహుశా నా సాహసం మీకనుచితంగా ఉంటుందేమో! కాని, మనసులోని భావోద్రేకం ఉధృతమైతే నిలువరించుకోలేని అసమర్థురాలను. మా క్లాసు పిల్లలంతా మీరంటే ఎంత పవిత్రభావంతో ఉంటారో అది అందరికీ తెలిసిన విషయమే! ప్రథమ దినం మిమ్మల్ని చూసిననాడే నాలో మీపై ప్రత్యేకాభిమానం ఏర్పడింది. నేను మీ దగ్గరగా రావాలని ఎంత ప్రయత్నించినా మీరింకా దూరమవుతూ వచ్చారు. అయినా, మీపై అనురాగం ఇంకా బల పడిందేగాని, క్షీణించలేదు. కాని, మీ రెందుకిట్లా స్త్రీ ద్వేషిగా ప్రవర్తిస్తున్నారో నా కనూహ్యంగా

ఉంది. అది, నాకే అవమానంగా ఉంది. ఎన్నిసార్లో మిమ్మల్ని అడుగుదామని ప్రయత్నించి ధైర్యంలేక ఊరుకున్నాను. కాని, ఈ హృదయ దౌర్బల్యంతో ఇక నిగ్రహించుకోలేక ఇట్లా వ్రాస్తున్నాను. ఏదైనా అనుచితంగా వ్రాస్తే క్షమించండి. ఎల్లప్పుడు మీ పవిత్ర హృదయ కమలంలో ఒక్క తుషార బిందువునైనా నా జన్మ ధన్యతనొందినట్లేనని భావిస్తాను. నా మాటలు మీ కసహ్యాన్ని కలిగిస్తే అది నా దురదృష్టమే అవుతుంది. ఇంతకంటే ఆడదాన్ని నేనేమి వ్రాయగలను? మీ సుఖదు:ఖాలను పంచుకోవాలనికోరే - కోమలి."

ఆ ఉత్తరం చదివి తెల్లబోయాడు రవికాంత్. కోమలికి ఇంత ధైర్యం కలదని అతనెప్పుడూ ఊహించలేదు. కోమలి తల్లితండ్రులు అతనికి బాగా తెలుసు. అసలు వాళ్ళు, వీళ్ళు ఒక వీధిలోనే ఉంటున్నారు. అతని వద్ద కోమలికి చనువు కూడ ఉంది.

రెండో ఉత్తరం శ్రీహరి వ్రాసినది - చదవనారంభించాడు రవికాంత్...

"శ్రీకాంత్-

ఒక్కసారి మీరు నా జీవితగాధ చెప్పమని ఒత్తిడి చేశారు. అప్పుడు చెప్పటానికి నిరాకరించాను. కాని, ఇప్పుడు చెప్పవలసిన సమయం వచ్చింది. కోమలి వ్రాసిన ఉత్తరం దీనితో జతపరుస్తున్నాను. అది చదివాక నా ఉత్తరం చదవండి. ఆమె మాటలే తిరిగి నా మనస్సులోని గాయాన్ని రేపినట్లయింది. అందుకనే ఇది వ్రాయటం.....

మిస్టర్ కాంత్! చరిత్ర లేని దేశం ఎంత అదృష్టవంతమైందో చరిత్రహీనుడైన మానవుడంత దురదృష్టవంతుడు. ఆ బాధే నా నరనరాలలోనూ జీర్ణించి నన్ను నిత్యరోగిగా తయారుచేసింది.

నా తల్లితండ్రులెవరో నాకు తెలియదు. కాని, పుట్టిన నాటి నుంచి కుటుంబరావుగారనే కాంట్రాక్టు వ్యాపారస్థుని కుమారుడుగా పెరిగాను. (ఆ విషయం నాకు తర్వాత తెలిసింది)

స్త్రీ ఎంత పవిత్రమూర్తిగా మన భారతీయులచేత అనాదిగా విలువను సంపాదించుకుందో నేటికాలంలో అంత నీచస్థితికి దిగజారిపోయింది. స్త్రీ చెడిపోయిందంటే పురుషుని దురాక్రమణ వల్లనే కావచ్చుకాని, ఆ పాపకృత్యంలో ఆమె మాత్రం పాలుపంచుకోకుండా ఉంటుందా? నా తల్లి పతితురాలు. నన్ను తన చీకటిపాపంగా నవమాసాలు మోసింది. ఆమె కన్యగా ఉండిన సమయంలోనే చేసిన ఈ దుష్కృత్యానికి ఆమె తల్లితండ్రులకు భయపడి ఆత్మహత్య చేసుకోబోయింది. కాని, కంట్రాక్టరు కుటుంబరావుగారు ఆ సమయంలో ఆమె కద్దుపడి ఈ చరిత్రహీనుడిని లోకానికర్పించడానికి రక్షించారు. ఆయనకు సుశీల అనే పన్నెండేళ్ల కుమార్తె తప్ప ఎవ్వరూ లేరు. మా అమ్మను తన ఇంటికి తీసుకువెళ్ళి పురుడు వచ్చే వరకు కంటికి రెప్పలా కాపాడారు. కాని, ఆమె ఆత్మహత్య చేసుకోకుండానే, తన పాపకృత్యానికి నా రూపాన్ని తన పాప ఫలితంగా ప్రతిరోజూ చూసి దు:ఖించి కృంగి కృశించకుండానే నేనీ ప్రపంచంలో కళ్ళు తెరిచిన మరుక్షణంలో భగవంతుని చేరుకుంది.

నేను కుటుంబరావుగారి కుమారుడుగా సుశీలక్కయ్య చేతుల్లో పెరగసాగాను. కాంత్! తల్లి రూపమేదో ఎరగని నేను సుశీలక్కయ్య ఒడ్డికలో మాతృప్రేమను చవిచూశాను. ఆమెను

వదిలి ఒక్కక్షణం ఉండేవాడిని కాదు. "అక్కా....అక్కా" అంటూ కూడా పడే వాడిని. నాకిప్పటికీ నా చిన్ననాటి చిలిపి చర్యలు గుర్తున్నాయి. ఆమె కన్నులలోని కాంతియే నాకు జీవం పోసింది. తల్లెవరో, తండ్రెవరో ఎరగని ఈ అభాగ్యుని కుటుంబరావుగారు కన్నకుమారుడుగానే సాకి పెంచసాగారు.

కాని, ఒకనాడు సుశీలక్కయ్య నాకు కనిపించలేదు. అప్పుడు నా కేడేళ్ళు. అప్పుడు జరిగిన సంఘటనలు నాకు గుర్తు లేవు. అక్కయ్య కనిపించక ఆ రోజుల్లో ఏడుస్తూ ఇల్లంతా తిరిగాను. ఆ ఊరు నుంచి కుటుంబ రావుగారు నన్నెక్కడికో తీసుకుపోయారు.

కొన్నాళ్ళు ఆమెపై బెంగతో ఏడ్చి ఏడ్చి క్రమంగా ఆమెను మరిచిపోయాను. అయినా, చిన్ననాటి సంఘటనలు స్మృతిపథంలో అట్లా చిరస్థాయిగా ఉండిపోయాయి. కాకినాడలోనే తదుపరి నా జీవితమంతా గడిచింది. అక్కడే కుటుంబరావుగారు నాకు తల్లీతండ్రీ తానై పెంచి పెద్ద చేశారు. కాలేజీలో బి.ఏ. చదివి ప్యాసయ్యాను. బెనారస్‌లో ఎమ్.ఏ.లో చేరాను. రెండో సంవత్సరం పూర్తికావచ్చింది.

ఇంతలో హఠాత్తుగా ఆయనకు జబ్బుగా ఉందని టెలిగ్రాము వచ్చింది. రెక్కలు కట్టుకు వచ్చినట్టు కాకినాడలో వాలాను. ఆయన మూడు రోజులుగా పక్షవాతంతో మంచం పట్టారుట! నా చదువు మాట కూడ మరిచిపోయి కన్నతండ్రికి పుత్రుడు చేసినట్లే సేవ చేశాను. అంతవరకు నేనాయనను తండ్రిగానే భావించాను. నా చదువు పాడైపోతుందని ఆయన వెళ్ళిపొమ్మన్నారు. కాని, బ్రతికుంటే అటువంటి డిగ్రీలెన్నయినా సంపాదించవచ్చు. తండ్రి పోతే మళ్ళీ దొరుకుతాడా? అని నేను వాదించాను. కాని, ఆయన బ్రతుకుతాడని ఎవ్వరికీ ఆశ లేదు.

ఆయనేదో చెప్పటానికి సంశయిస్తున్నాడని నేను గ్రహించాను. ఒత్తిడి చేసి అడిగాను. "చచ్చిపోయేలోగా నేను నీ తండ్రిని కాదని చెప్పటానికింతకాలం పట్టింది బాబూ! నీ జీవిత చరిత్ర చెప్పి నిన్ను బాధించాలని లేకపోయినా నిజాన్ని కప్పిపుచ్చాననే వ్యథ నన్ను మరీ క్రుంగదీస్తూంది. దానికి మరో కారణముంది. నీకు సుశీలక్కయ్య గుర్తుందనుకుంటాను. ఇన్నేళ్ళుగా ఆమె ఏమైంది అని అడిగేవాడిని. ఆమె చేసిన నీచకృత్యమే ఈ ప్రాణినింతవరకు హింసించింది..."

అప్పుడే ఆయన నా జీవిత చరిత్ర సాకల్యంగా వివరించాడు. నాలో అగ్ని పర్వతాలు బ్రద్దలయ్యాయి. కన్నతల్లినే ఎరుగని నాలో సుశీలక్కయ్య కూడ ఎవరితోనో లేచిపోయిందని ఆయన చెప్పేసరికి ఆమెపై అజ్ఞాతంగా వున్న పవిత్ర ప్రేమ నిర్మూలమైపోయింది. నాకు గుర్తు లేదు కాని, కుటుంబరావుగారి కెదురింట్లో ఉంటే భూషణంగారి అబ్బాయి మా యింటి కస్తమానం వచ్చేవాడట. అసలా చనువు ఇచ్చింది ఈయనే! సుశీలక్కయ్య కూడ స్కూలు ఫైనలు వరకు చదివింది. వాళ్ళిద్దరూ చాల చనువుగా ఉండటం ఈయనకు గిట్టేది కాదు. అయినా, నోరు తెరిచి మందలించలేకపోయేవాడు. గూఢంగా మాట్లాడి సుశీలక్కయ్యకు నీతులు గరపబోయాడు. కాని, ఆమె ఒకనాటి రాత్రి ఆ అబ్బాయితో వెళ్ళి పోయింది. ఆ

విషయం సుశీలక్కయ్యే చిన్న చీటిపై వ్రాసి ఇంట్లో పెట్టి వెళ్ళిపోయిందట. కాని ఈయన అభిమానం దెబ్బ తిన్నట్లయింది. తెల్లవారిన వెంటనే అక్కడ భూషణంగారి వల్ల ఏం అవమానం జరుగుతుందోనని శంకించి, తన స్థితికి నిందించుకుంటూ నన్ను తీసుకొని ఆ ఊరు వదిలి పెట్టేశాడు.... తర్వాత ఆ కంట్రాక్టు వ్యాపారంతోనే నన్నింత వాడిని చేశాడు.

ఈ విషయాలన్నీ ఆయన అతి కష్టంపై నాకు చెప్పాడు. నా కన్నతల్లి, సుశీలక్కయ్య గుర్తుకు వచ్చి నేనే ఏదో పాపం చేసినవాడిలా తల్లడిల్లిపోయాను.

"నాయనా! స్త్రీ అంటే నేనెంతో పవిత్రభావంతో ఉండేవాడిని. కాని, నీ తల్లి వల్ల, సుశీల వల్ల నాలో అసహ్యభావం పుట్టుకు వచ్చింది. స్త్రీ లేనిదే పురుషుడే లేదన్నది నిజమే కావచ్చు. పురుషుల నిరంకుశత్వానికి స్త్రీ బలియైపోతుండవచ్చు. కాని, ఆమె చేసే స్వల్ప పాపానికే అది ఆమెకు శాపంగా పరిణమిస్తుంది. మన భారతదేశంలో నేటి సాంఘిక స్థితి దృష్ట్యా చూస్తే ఒక్క పురుషునివల్ల ఒక్క స్త్రీకే కళంకం రావచ్చు కాని, ఒక స్త్రీ వల్ల ఆ కుటుంబానికే కళంకం ఆపాదించబడుతుంది. అందుకనే ఉద్రిక్తపూరితులైన స్త్రీలకు విద్యావంతులైన పవిత్రభావం గల పురుషులు దూరంగా ఉండడం ఆ స్త్రీలకే ముఖ్యంగా మేలు చేకూర్చినట్ల వుతుంది. నువ్వే కాకిని బాధపడకు. నా మరణంతో విరక్తి భావం పెట్టుకొని నీ పుట్టుక హీన చరితతో కూడుకున్నదని ఎట్టి అఘాయిత్యానికి పాల్పడకు. జీవితాన్నే ప్రేమించలేనివాడు తోటి మానవుల్ని ప్రేమించలేడు. అదే నేను నీ తల్లికి చెప్పింది కూడా! గత చరిత్ర మరిచిపో! నీవంటి పురోభివృద్ధిగల కొడుకు నాకున్నందుకు హాయిగా ప్రాణాలు విడుస్తాను... నీవు చిరకాలం యశస్సుతో జీవించటమే నా కోరిక."

అన్నట్లుగానే ఆ ధన్యజీవి ఆ రాత్రే ప్రాణం విడిచాడు. నాలో విరక్తి విస్తృతమై ఆత్మహత్యకు పురికొల్పినప్పటికీ, ఏకాకి నన్నుభావం కృంగదీసి విలపింజేసినప్పటికీ – నా పెంపుడు తండ్రి... కాదు, నా తండ్రి కుటుంబరావుగారు చెప్పిన మాటలే నాకు జీవం పోశాయి.

ఆయన విడిచిన నాలుగు వందల రూపాయలు ఖరీదు చేసే ఆస్తి మాత్రం నా ఎమ్.ఎ. పూర్తి కావటానికి సరిపోయింది. ప్యాసయిన వెంటనే ఇక్కడ అప్పాయింటయ్యాను.

కాంత్! ఆయన నన్నొక వ్యక్తిగా తయారుచేయటానికే అప్పటివరకు జీవించాడనిపించింది. చరిత్రహీనుడినై వ్యక్తిగా మాత్రం మనగలుగుతున్నాను. ఇప్పటికైనా స్త్రీ పై నాకెందుకు విరక్తిభావం ఉందో మీకర్థమైందనుకుంటాను.

నేను ఈ కాలేజీకి వచ్చిన క్రొత్తలో కోమలిని చూడటం తటిస్థించింది. నేను తొలి చూపులోనే ఆమె రూపానికి అప్రతిభుడనయ్యాను. దానికి కారణం – ఆమె ముమ్మూర్తులా నా చిన్ననాటి సుశీలక్కయ్యలా ఉండటమే! పద్దెనిమిదేళ్ళ క్రితం ఆమె ఇట్లాగే ఉండేది. ఆమె పై నున్న నా సోదర ప్రేమకు నా తండ్రి చెప్పిన చరిత్ర విఘాతం కలిగించినప్పటినుంచీ నేను స్త్రీ విషయంలో ఉదాసీనత వహిస్తూ వచ్చాను. కాని, సుశీలక్కయ్య రూపంలో ప్రతి దినమూ క్లాసులో కనిపించే కోమలి నా మనస్సులో ఏర్పడిన గాయాన్ని రేపసాగింది.

అందుకనే, మొదటల్లో వాళ్ళ క్లాసు తీసుకోనన్నాను. ప్రిన్సిపాలుగారి మాట తీసివేయలేక తీసుకున్నాను. నేనెంత నిగ్రహశక్తితో ఉన్నా కోమలి నాకు దగ్గరగా రావటానికి ప్రయత్నించ సాగింది. అది నేను గ్రహించకపోలేదు. సాధ్యమైనంతవరకు దూరంగా ఉంటూ వచ్చాను.

కాని, ఈ వేళ ఆమె ఉత్తరమే వ్రాసేసరికి నాలో కంగారు పుట్టింది. నా తండ్రి మాటలు నాకు గుర్తుకు వచ్చాయి. ఉద్రిక్తపూరితురాలైన కోమలి శ్రేయస్సు కోసం నేనిక్కడ నుంచి వెళ్ళి పోదల్చుకున్నాను. అందుకని వారం రోజులు సెలవు పెట్టాను. ట్రాన్స్‌ఫర్ ఆర్డర్సు వచ్చే లోపల ఒకసారి కాకినాడ వెళ్లాలని ఉంది. ఈ సాయంత్రం పాసెంజరులో వెడతాను.

ఉజ్జ్వల భవిష్యత్తుకల కోమలి శ్రేయస్సు కోసం నేనిట్లా చేయక తప్పదు. మీరు నాకు మిత్రులు. కోమలి శ్రేయోభిలాషులు. కనుక సమయం వచ్చినందువల్ల ఇంతగా వ్రాశాను. అన్యులకు తెలియవలసిన అవసరం లేదు. ఈ రెండు ఉత్తరాలతోను పని లేదు. కనుక చించి వెయ్యండి. ఈ విషయాలు మీరు హృదయంలోనే ఉంచుకుంటారని తలుస్తూ...

– శ్రీహరి."

ఆ పెద్ద ఉత్తరం చదివేసరికి రవికాంత్ కళ్ళు అశ్రుసిక్తాలయ్యాయి. అంతేకాదు. అతనిలో ఏదో తెలియని బాధ, సంతోషం, సంశయం, సమ్మిశ్రితమయ్యాయి. ఏదో అనుమానం తీరే సమయం వచ్చినవాడిలా గబగబ లేడీస్ రూమ్‌లో రజనిని కలుసుకోవడానికి వెళ్ళాడు....

సాయంత్రం నాలుగు గంటలైంది. రాత్రి ఏడుగంటలకు ట్రెయిను వస్తుంది. ఎంత తొందరగా ఆ ఊరినుంచి వెళ్ళిపోతే అంత మంచిదన్నట్లుగా అప్పుడే పెట్టే బేడా సర్ది సిద్ధం చేశాడు శ్రీహరిరావు.

రవికాంత్‌కు ఉత్తరం పదకొండు గంటలకు పంపిన దాదిగా ఈ పనిలోనే మునిగిపోయాడు. మధ్యాహ్నం టిఫిను కూడా చేయలేదు. అప్పటి వరకు అతని కాకలి వెయ్యలేదు కూడా. ఏదో మంచి పని చేస్తున్నానే సంతృప్తి అతనికామాత్రం శక్తిని ప్రసాదించింది.

బట్టలు వేసుకొని హోటలుకు వెడదామని గదికి తాళం వేస్తున్న శ్రీహరి ఇంటికెదురుగా కారు ఆగటం చూసి తెల్లబోయాడు. నెమ్మదిగా మెట్లు దిగి కారును సమీపించాడు. డ్రైవింగ్ సీటులో నలభై ఏళ్ళ వయస్సుగల వ్యక్తి కూర్చుని మందస్మితం చేస్తున్నాడు.

"మీరేనా శ్రీహరిరావుగారు?" అన్నాడతను.

"అవును. మీరు?"

"నా పేరు రాజారావు. మీతో పని ఉండి వచ్చాను."

శ్రీహరి అతని చిరునవ్వు చూసి సందిగ్ధావస్థలో పడ్డాడు. "చెప్పండి" అన్నాడు.

"మీ రెక్కడికి బయలుదేరారు?"

"అట్లా హోటల్‌కు వెడదామని."

"అయితే, కారులో వెడదాం రండి."

"మీకెందుకు శ్రమ? నడిచి వెడతాలెండి. దగ్గరేగా!"

"మరి అంత బెట్టుగా ఉండకండి. మీతో నాకు పని ఉందని చెప్పాను కదా!" అన్నాడు రాజారావు చిరునవ్వుతో.

ఇక మాట తీసివేస్తే అసభ్యంగా ఉంటుందని ఫ్రంటు సీటులో అతని ప్రక్కనే కూర్చున్నాడు. కారు తారాజువ్వలా దూసుకుపోయింది. రాజారావే చెప్పుతాడని మాట్లాడకూరుకున్నాడు శ్రీహరి. కాని, అతడు మాట్లాడకపోవటం సరికదా! హోటళ్ళన్నీ వదిలిపెట్టి ఒక పెద్ద బంగళాలోకి కారును పోనిచ్చాడు.

అదేదో వింతలా చూస్తూండిపోయాడు శ్రీహరి. రాజారావు వేషభాషలలో లక్షాధికారిలా కనిపిస్తున్నాడు. ఊరూ పేరులేని తననిట్లా చూడడం అతని కృత్యాశ్చర్యం కలిగించింది. మౌనంగా అతని వెంట బంగళాలోకి నడిచాడు శ్రీహరి.

ఒక గదిలోకి వెళ్ళారిద్దరూ. దక్షిణంవైపు గాలి చల్లగా వీస్తూంది. ఎదురుగా పూలతోట లోని పుష్ప సౌరభాలు గుప్పించి మత్తును కలిగిస్తున్నాయి. ఏదో రాజోద్యానమందిరంలో ఉన్నట్లు అనిపించింది శ్రీహరికి.

రాజారావే స్వయంగా ఒకపళ్ళెంలో మైసూరుపాకు, లడ్డు పెట్టి పట్టుకు వచ్చాడు. శ్రీహరికి ముందుబల్ల మీద ప్లేటు పెట్టి, "మిస్టర్ శ్రీహరీ! ముందివి తినండి. తర్వాత మాట్లాడుకుందాం," అన్నాడు.

శ్రీహరి ఒక క్షణం తెల్లబోతూ అతని ముఖంలోకి చూసి గబుక్కున పైకిలేస్తూ, "మీరెవరో నాకు తెలియకుండా అతిథ్యం తీసుకోవటం ఉచితం కాదు" అన్నాడు.

రాజారావు చిన్నగా నవ్వాడు. "పోనీ, తెలిశాకనే తిందురుగానిలెండి. కూర్చోవచ్చుగా!"

మౌనంగా కూర్చున్నాడు శ్రీహరి అతని వైపే చూస్తూ. "మిస్టర్ హరీ! భూషణంగారు, కుటుంబరావుగారు కంట్రాక్టు వ్యాపారంలో సహజీవులుగా ఎన్నాళ్ళున్నారో నీకు తెలియకపోయినా నాకు తెలుసు. వారిద్దరి మధ్య ఎంత స్నేహబంధం ఉండేదో భూషణం గారి కొడుకు – కుటుంబరావుగారి కూతురు మధ్య అంత అనురాగబంధం ఇమిడి ఉండేది. ఇది పెద్దవాళ్లిద్దరికీ తెలుసు. తల్లులులేని పిల్లలిద్దర్నీ అతిగారాబంతో పెంచారు. కాని, ఏదో మధ్యవర్తి పొరపాటువల్ల భూషణంగారపోహపడి కుటుంబరావుగారిని తూలనాడాడు. తను తప్పు చేయలేదని వాదించని అహంభావం కల కుటుంబరావు కంట్రాక్టు సంబంధం భూషణంగారితో త్రెంచుకున్నాడు. భూషణం గారు తర్వాత తప్పు తెలుసుకొని కుటుంబరావును క్షమాభిక్ష అడిగినా ఇంకా వేడి తగ్గని కుటుంబరావు ఆయన్ను హేళన చేసి తిరిగి జాయింటు కంట్రాక్టు చేయటానికంగీకరించలేదు. దానితో భూషణంగారికి కోపం వచ్చింది. అప్పటి నుంచీ ఇద్దరూ బద్ధ శత్రువులయ్యారు. వాళ్ల మధ్య స్నేహబంధం విడిపోయిందన్నమాటే కాని, వారి పిల్లల మధ్య అనురాగబంధం మరింత ధృఢమైంది. అదే వాళ్ళు ఇల్లు విడిచిపోయి పెళ్ళి చేసుకోటానికి కూడా దోహదం చేసింది." రాజారావు ఒక్కక్షణం ఆగాడు. అతని కనుకొలకుల్లో నీటి బిందువులు స్పష్టంగా చూశాడు శ్రీహరి. అతని మాటలు శ్రీహరి

కత్యాశ్చర్యం కలిగించాయి.

"మీకీ వివరాలన్నీ ఎట్లా తెలుసు? మీరు..... మీరు...." అని శ్రీహరి సందేహించాడు.

"అవును. నేనే సుశీల భర్తను. మా వైవాహిక బంధం వల్ల నైనా వాళ్ళిద్దరికీ పొత్తు కుదర్చాలని ఇల్లు వదిలి వెళ్ళిపోయాము. వివాహం చేసుకొని మా నాన్నగారు భూషణం గారికి, కుటుంబరావు గారికి తెలియపరిచాము. వెంటనే మమ్మల్ని ఇంటికి రమ్మని నాన్నగారు టెలిగ్రాము ఇచ్చారు. ఆత్మాభిమానమనే అపోహలో కుటుంబరావుగారు సుశీల చర్యను నిరసించి నిన్ను తీసుకొని ఆ ఊరు వదిలి వెళ్ళిపోయారు. కాని, మా నాన్నగారు మమ్మల్ని పల్లెత్తు మాట కూడ అనలేదు. తర్వాత కుటుంబరావుగార్ని గురించి చాల చోట్ల వాకబు చేసినా ప్రయోజనం లేకపోయింది. తండ్రి కోసం, సహోదరుడుగా పెంచిన నీకోసం ఆమె బాధపడని రోజు లేదు. నిజానిజాలు తెలుసుకోకుండా ఒక దుష్కృత్యంతో పోలిక తీసుకువచ్చి స్త్రీ జాతినే నిరసించటం అన్యాయమనిపించుకుంటుంది శ్రీహరీ! మీ అమ్మకు జరిగిన అన్యాయమే ప్రతి విషయంలో జరుగుతుందనుకోవటం పొరపాటు. మా తండ్రుల పొత్తు కోసమే మేమట్లా పారిపోయి పెళ్ళి చేసుకున్నాము. కాని పిరికితనంచేత కాదు. సత్యదూరమైన లోకజ్ఞానం కుటుంబరావుగారు నీలో అట్లా పాదుగొలిపారు. ఆయన చేసిన పని మంచిపని కాదని నేనను. కాని, ఆయన దురహంకారం మంచిని కూడ మభ్యపెట్టింది. అదే నీలో స్త్రీ ద్వేషాన్ని రగిల్చింది..."

"అయితే... కోమలి మీ కూతురన్నమాట!" అన్నాడు శ్రీహరి ఆశ్చర్యంలోంచి తేరుకుంటూ.

"అవును తమ్ముడూ! రజని వచ్చి నీ ఉత్తరం విషయం చెప్పకపోతే తిరిగి నా తమ్ముడిని పోగొట్టుకునేదాన్ని..." అంటూ అంతవరకు గది బయట ఉన్న సుశీల లోపలికి వచ్చి శ్రీహరి చేతులు పట్టుకుంది. ఆమె కళ్ళవెంట ఆనందభాష్పాలు ధారాపాతంగా కారి పోతున్నాయి..... ఉద్వేగంతో సోదర ప్రేమతో ఆమె కళ్ళల్లోకి చూశాడు శ్రీహరి. ఏదో ప్రౌఢ చిహ్నాలు తప్పించి ఆమెలో ఏ మార్పులూ లేవు.

"అక్కయ్యా!...." అన్నాడు శ్రీహరి. అతని హృదయంలోంచి ఆ పిలుపు వచ్చింది.

"ఎన్నాళ్ళకు నీ పిలుపు విన్నాను హరీ!" అంది ఆమె.

"నువ్వు కాబట్టి సరిపోయింది. లేకపోతే కోమలి అచ్చు తల్లి ననిపించేది" అన్నాడు రాజారావు చిరునవ్వుతో. తలుపు చాటునున్న కోమలిని చూసి అతనా మాటలన్నాడని శ్రీహరికి తెలియదు.

"ఛో నాన్నా!" అంటూ తండ్రి చాటుకు వచ్చి సిగ్గు ముంచుకురాగా కొంటెచూపులు విసిరింది కోమలి. అక్కయ్య లడ్డు నోట్లో పెడుతూంటే ప్రేమగా తింటున్న శ్రీహరి మదనుని అనుకరించి చూపులతూపు లామెపై విసిరాడు.

●